చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వానాకాలం సీజన్ వరిధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు వచ్చాయి. ఈ నెలాఖరు వరకు కేంద్రాలకు ధాన్యం రావడం ఆగిపోతుందని భావిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కోసం 329 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, 247 కేంద్రాలను ఇప్పటికే మూసేశారు. 82 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 2,31,392 మెట్రిక్ టన్నులధాన్యాన్ని కొనుగోలు చేశారు. 38,346 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ ధాన్యం విలువ 536.82 కోట్లు కాగా ఇప్పటికే 36,757 మంది రైతుల ఖాతాల్లో 514.88 కోట్ల రూపాయలు జమ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 70,777 మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నరకం కాగా 1,60,451 మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకానికి చెందినది. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరిధాన్యం పండించిన రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్‌ను ప్రకటించింది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన సన్నరకం వరిధాన్యానికి 35.38 కోట్ల బోనస్‌ను చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికే 30.30 కోట్ల రూపాయలు రైతులకు అందించారు. మరో 5.08 కోట్ల బోనస్ సొమ్మును రైతులకు చెల్లించాల్సి ఉన్నది.

- 247 కొనుగోలు కేంద్రాలు మూసివేత
- 82 కేంద్రాల్లో కొనసాగుతున్న కొనుగోళ్లు
- ఇప్పటికి కొన్నధాన్యం 2.31 లక్షల మెట్రిక్ టన్నులు
- ధాన్యం విలువ రూ. 536.82 కోట్లు
- సన్నధాన్యానికి రూ. 30.30 కోట్ల బోనస్ చెల్లింపు

ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభం

ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 2.75 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఆరు లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతుల సొంత వినియోగం కోసం 55 వేల మెట్రిక్ టన్నులు, విత్తన పంటగా మరో 75 వేల మెట్రిక్ టన్నులు మినహాయించగా, సుమారు 4.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు విక్రయిస్తారని భావించారు. ఇందులో 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేసినా నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల మేరకు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు 2.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించారు. మరో 20 రోజులపాటు కొనుగోలు కేంద్రాలు నిర్వహించినా మూడు లక్షల టన్నులకు మించి ధాన్యం కొనుగోళ్లు జరగకపోవచ్చని అంచనా వేస్తున్నారు. వ్యవసాయశాఖ అంచనా వేసిన విధంగా దిగుబడి వచ్చినా ఆశించిన మేరకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాకపోవడానికి కారణం ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభించడమేనని అంటున్నారు. కస్టమ్ మిల్లింగ్ విషయంలో మిల్లర్లకు, ప్రభుత్వానికి ఒప్పందం కుదరడంలో ఆలస్యం జరిగిన కారణంగా సీజన్ మొదట్లో పంట నూర్పిడులు చేసిన రైతులు ధాన్యాన్ని నిల్వ చేయడం ఇబ్బందిగా భావించి మిల్లర్లకు మద్దతు ధరకన్నా తక్కువకే విక్రయించుకోవాల్సి వచ్చింది. సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్న కారణంగా కొనుగోలు కేంద్రాలకు మూడు లక్షల మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం రాకపోవచ్చని భావిస్తున్నారు.

రైతులకు చెల్లించింది రూ. 514.88 కోట్లు

ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికిగాను 514.88 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించగా, మరో 21.94 కోట్ల రూపాయలను త్వరలో చెల్లించేందుకు సివిల్ సప్లయిస్ శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. 1,589 మంది రైతులకు ఈ డబ్బు అందాల్సి ఉన్నది. 5.08 కోట్ల రూపాయల సన్నధాన్యం బోనస్ రైతులకు అందాల్సి ఉన్నది.

భక్తి పాశం... ధనుర్మాసం..

- రేపటి నుంచి ప్రారంభం



ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ధనుః రాశిలో ప్రవేశించి మకర సంక్రమణం (జనవరి 14) వరకూ కొనసాగే ధనుర్మాసం సోమవారం నుంచి ప్రారంభమవుతుంది. మార్గళి మాసంగా పిలిచే ఈ మాసం శ్రీవైష్ణవ సాంప్రదాయ పరులకు విశిష్టమైంది.ఆండాళ్, రంగనాయకి, శూడి కొడుత్త నాచ్చియార్, ఆముక్త మాల్యదగా పిలుచుకునే గోదాదేవి భక్తితో పూజించి రంగనాథుడిని భర్తగా పొంది, 12 మంది ఆళ్వారుల సరసన స్థానం పొందింది. ఆమె పాడిన 30 పాశురాలు (కీర్తనలు) ఎంతో ప్రాచుర్యం చెందాయి. ఆమె ఆచరించిన వ్రతమే గోదా, శ్రీ, మార్గళి, కాత్యాయని వ్రతాల పేర్లతో పిలుస్తారు.

వ్రత విధానమిదే....

స్వామి ప్రతిమకు మధుసూదనుడు అని పేరు పెట్టి పూజించాలి. రోజూ తులసీదళాలతో అర్చించాలి. నైవేద్యంగా నెయ్యి, బియ్యం, పెసరపప్పు, బెల్లం, మిరియాలు, జీలకర్ర వేసి ఉడికించిన పొంగలిని నైవేద్యంగా పెట్టాలి. తొలి 15 రోజులు ఇలా చేస్తూ తర్వాత 15 రోజులు దద్ధ్యోజనాన్ని నైవేద్యం పెట్టాలి. స్వామిని పాశురాల పఠనంతో పూజించాలి. ముఖ్య పాశురాల రోజుల్లో విశేష పూజలు, కూడారై నాడు ప్రత్యేక పాత్రల్లో పాయసాన్ని ఉంచి నైవేద్యంగా పెట్టాలి. వ్రత మధ్య కాలంలో లేదా చివరన వీలును బట్టి గోదారంగనాథ కల్యాణం నిర్వహించాలి.

ఇల్లందకుంటలో ఏర్పాట్లు..

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం నుంచి జనవరి 9వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో కందుల సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. 16న ధనుర్మాసం ప్రారంభమవుతుందన్నారు. జనవరి 9న ఉదయం 10గంటలకు స్వామివారిని గ్రామ దేవాలయం నుంచి ప్రధాన ఆలయంలో ప్రవేశం చేస్తారు. జనవరి 10న ఉదయం 5:30గంటలకు వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం, అనంతరం గరుడ సేవ కార్యక్రమం చేసారు. గరుడ సేవలో భక్తులు 500 రూపాయలు చెల్లించి రసీదు పొందాలని సూచించారు. జనవరి 11 ఉదయం 10గంటలకు కుడారై ఉత్సవం, అమ్మవారి సేము, జనవరి 13 ఉదయం 10 గంటలకు శ్రీగోదారంగనాథస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

17న జూనియర్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఈనెల 17న నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్‌కుమార్, సీహెచ్ మల్లేశ్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. బాలికలు 60 కిలోల లోపు, బాలురు 70 కిలోల లోపు బరువు కలిగి జనవరి 12, 2005 తర్వాత జన్మించినవారై ఉండాలని చెప్పారు. క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో జిరాక్సులతో స్టేడియంలో సంపత్‌రావు, సిహెచ్ మల్లేశ్, కె సునీల్‌రెడ్డికి రిపోర్టు చేయాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులను 27న జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు.

లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి బి.ప్రతిమ

కరీంనగర్ లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్ కేసుల్లో సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి బి ప్రతిమ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్‌లో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనవసర తగాదాలతో వేసుకున్న చిన్న చిన్న కేసులు, కుటుంబ తగాదాల కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకుంటే డబ్బు, సమయం వృథా కావన్నారు. గతంలో గ్రామాల్లో చిన్నచిన్న తగాదాలు, కుటుంబ గొడవలను అక్కడి పెద్ద మనుషులు పరిష్కరించే వారని, ఆ స్థానంలో ఇప్పుడు లోక్ అధాలత్‌లు వచ్చాయని తెలిపారు. ప్రతి మండల, జిల్లా కేంద్రంలో న్యాయ సేవాధికార సంస్థలు ఉంటాయని, వాటిని ఆశ్రయించి ఉచితంగా న్యాయ సహాయం, సలహాలు పొందవచ్చని జడ్జి సూచించారు. ఏసీపీ నరేందర్ మాట్లాడుతూ రాజీతో క్రిమి నల్ కేసులను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేస్తు న్నామని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి వెంకటేశ్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లపై అవగాహన కల్పించారు. లోక్ అదాలత్‌కు బార్ అసోసి యేషన్ పూర్తి మద్దతు ఉంటుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, కార్యదర్శి బీమా సాహెబ్ తెలిపారు. ఈకార్యక్రమంలో న్యాయమూర్తులు, అడిషనల్ పీపీ గౌరు రాజిరెడ్డి, ఏసీపీ వెంకటరమణ, సీఐలు జాన్‌రెడ్డి, స్వామి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

56,167 కేసుల పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 56,167 కేసులను పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. 36 సివిల్ కేసులు, 2,464 క్రిమినల్, 53,667 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కేసుల పరిష్కారింలో జిల్లాకు 23వ స్థానం లభించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద విద్యార్థుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని దేవంపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గురుకులాలలో చదువుతున్న విద్యార్థులను గత పాలకులు విస్మరించడంతో నాణ్యమైన భోజనం, విద్య లభించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో నవంబరు నుంచి గతంలో కంటే 40 శాతం కాస్మొటిక్స్, డైట్ చార్జీలను పెంచారన్నారు. వసతి గృహాల సమస్యలతోపాటు అద్దె భవనాలు, ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యనందించడంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో కామన్ మెనూ ప్రారంభించడం సంతోషకరమన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆమె సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ శ్రీధర్, ఎంఈవో మధుసుధనాచారి, ఏఎంసీ చైర్మన్ ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ జగన్నాథం పాల్గొన్నారు.

జోరుగా బిట్‌కాయిన్ దందా



- జిల్లాలో రూ. 500 కోట్ల వరకు పెట్టుబడులు
- ఎటువంటి గ్యారంటీ లేకుండా ఆన్‌లైన్‌లో వ్యాపారం
- ఆన్‌లైన్ చెయిన్ సిస్టం ద్వారా చేరికలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బిట్‌కాయిన్ ఆన్‌లైన్ చెయిన్ సిస్టం బిజినెస్ జిల్లాలో జోరుగా నడుస్తోంది. ఈ వ్యాపారంలో జిల్లా వాసులు 400 కోట్ల నుంచి 500 కోట్ల రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. ఎక్కడ కూడా గ్యారంటీ లేకుండా మొత్తం వ్యాపారం ఆన్‌లైన్‌లోనే నడుస్తుంది. ఆన్‌లైన్ చెయిన్ సిస్టం బిజినెస్‌లన్నీ దుబాయ్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా దేశాల కేంద్రంగా నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యాపారంలో రియల్టర్లు, డాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు మొదలుకొని సామాన్యుల వరకు పెట్టుబడులు పెట్టినట్లుగా తెలుస్తోంది. కొందరు ఆన్‌లైన్ బిజినెస్‌లో చాలా మంది డబ్బులు నష్టపోయారు. కొందరు కోట్లకు పడగలెత్తారు. వారిని చూసి పెద్దఎత్తున పెట్టుబడి పెడుతున్నారు. బిట్‌కాయిన్ పేరిట ఆన్‌లైన్‌లో కొన్ని కంపెనీల్లో వారి ఖాతాలకు పెట్టుబడుల డబ్బులను జమచేస్తున్నారు. పెట్టుబడులు పెట్టిన వారికి ఆయా కంపెనీలు, ఏజెంట్లు ఒక యాప్ ద్వారా ఐడీని ఇస్తున్నారు. ఐడీ ద్వారా ఆ యాప్‌లోకి ఎంటర్ అయి ఎప్పటికప్పుడు బిజినెస్‌ను పరిశీలించవచ్చు. ఈ ఐడీ ద్వారానే వారి కంపెనీ ప్రొడక్ట్‌లు ఆన్‌లైన్‌లోనే అమ్ముకునేందుకు వీలుంటుంది. కొన్ని కంపెనీలు ఆన్‌లైన్ ద్వారా కస్టమర్ల ఖాతాలకు డబ్బులు జమ చేస్తుండగా మరికొన్ని కంపెనీలు హవాలా ద్వారా డబ్బులు ముట్టజెబుతున్నాయి. ఈ దందాలో 20 వేలపైగా కంపెనీలు ఉన్నట్లు చెబుతున్నారు. కొన్ని కంపెనీలు నెల నెలా 15 నుంచి 20 శాతం వరకు కమీషన్‌ను కస్టమర్లకు చెల్లిస్తున్నాయి. కొన్ని కంపెనీలలో చెయిన్ సిస్టంలో కమిషన్, బోనస్‌లతోపాటే విదేశీ టూర్‌లను అందిస్తున్నారు.

పెద్ద మొత్తంలో కమీషన్లు



మొదటగా ఒక వ్యక్తి లక్ష రూపాయలతో తరువాత అతని ద్వారా మరి కొంత మందిని ఆ బిజినెస్‌లో పెట్టుబడులు పెట్టిస్తే మొదటి వ్యక్తికి పెద్ద మొత్తంలో కమీషన్‌తో పాటు, కూపన్లు, బైక్‌లు, కార్లు, విదేశీ పర్యటనలు వంటి ఆకర్షణీయమైన ఆఫర్లను కంపెనీలు ఇస్తున్నాయి. ఈ బిట్‌కాయిన్ ఆన్‌లైన్ చెయిన్ సిస్టం ద్వారా వందల కోట్ల రూపాయలు విదేశాలకు చేరుతూ మనీ లాండరింగ్ జరుగుతుందనే విమర్శలు ఉన్నాయి. ఎక్కడా ఎటువంటి పన్నులు చెల్లించకుండా కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది. ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఒక వ్యాపారి తన ఇంటి స్థలాన్ని మూడు నెలల కిందట 35 లక్షలకు విక్రయించడానికి నిరాకరించాడు. బిట్‌కాయిన్‌లో పెట్టుబడి కోసం అదే వ్యాపారి 25 లక్షలకే ఇంటి స్థలాన్ని విక్రయించాడు. ఆన్‌లైన్ చైన్ సిస్టం బిజినెస్‌లో ఎక్కువ మంది డబ్బులు వస్తున్నాయనే దురాశతో ఉన్న ఆస్తులను ఊడ్చుకెళ్ళి పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారు. ఇటీవల జగిత్యాల ప్రాంతానికి చెందిన ఒక వ్యాపారిని నమ్మి వందలాది మంది కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. మొదట్లో వారికి ఆరు నుంచి 10 శాతం ఆదాయం వచ్చింది. దీంతో వారు మరింత ఆశతో పెద్ద మొత్తంలో డబ్బులను పెట్టుబడిగా పెట్టారు. ఆ తర్వాత కొద్ది రోజులకు ఆ వ్యక్తి తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని బిచాణా ఎత్తివేయడంతో బాధితులు లబోదిబో మన్నారు.

మోసాలు.. నష్టాలు

ఈ బిట్‌కాయిన్ ఆన్‌లైన్ వ్యాపారంలో ఎక్కడా.. ఎవరూ సెక్యూరిటీగా ఉండరు. కొందరు ఇదివరకే ఈ వ్యాపారం చేసి డబ్బులు గడించినవారు మరికొందరిని వారి కమిషన్ కోసం చెయిన్‌సిస్టంలో చేర్పిస్తూ, వారి డబ్బులకు సెక్యూరిటీగా చెక్కులు, ఆస్తుల మార్ట్‌గేజ్ చేస్తున్నారు. ఈ వ్యాపారంలో వచ్చే కమిషన్‌లో 50 శాతం వాటా ఇవ్వాలని ముందుగానే ఒప్పందం చేసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి వారి ద్వారా చెయిన్ సిస్టంతో మరికొందరిని ఈ వ్యాపారంలోకి తీసుకురావటం ద్వారా పెద్ద మొత్తంలో కమిషన్, విదేశాల టూర్‌లు పొందుతున్నారు. ఇటువంటి బడా వ్యాపారులు వారి ద్వారా ఈ వ్యాపారంలో చేరిన వారితో ఒక వాట్సాప్ గ్రూపు తయారు చేసి ఆన్‌లైన్ బిజినెస్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియపరుస్తున్నారు.

రేపు ప్రజావాణి రద్దు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 16న రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు.

క్రైం కార్నర్

శాంతిభద్రతలకు ఆటంకం.. ఇద్దరి అరెస్టు

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన గంభీరావుపేట మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కి చెందిన శివరాత్రి లక్ష్మణ్, చల్ల సతీష్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నవంబరు 24న చల్ల రమేశ్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ప్రమాదానికి కారణమైన వారి నుంచి పరిహారం ఇప్పించాలని అదేరోజు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రహదారిపై రాస్తారోకోతో ప్రజలకు ఇబ్బందులు కల్పించిన చల్ల బాలరాజు, చల్ల సతీష్, శివరాత్రి లక్ష్మన్, శివరాత్రి నరసవ్వ, శివరాత్రి భాగ్య శివరాత్రి సంతోష్, సంపంగి మల్లవ్వ, కొమ్మరాజు ఐలయ్యతోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు. వారిలో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలిపారు. విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని రోడ్ల మీదకు వచ్చి సామాన్య ప్రజలకు, శాంతి భద్రతలకు ఇబ్బందులు కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


గొల్లపల్లి మధు(ఫైల్)

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు గ్రామానికి చెందిన గొల్లపల్లి మధు(42) గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వివాహమై సంవత్సరాలు గడుస్తున్నా సంతానం లేదనే బాధతో మానసికంగా కుంగిపోయిన మధు తాగుడుకు బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగి ఆపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు కరీంనగర్‌కు, అక్కడినుంచి వరంగల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు మధు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు.

బైక్ ఢీకొని బాలికకు తీవ్ర గాయాలు

గన్నేరువరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో బైక్ ఢీకొని బాలిక(4)కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఖాసింపేట గ్రామానికి చెందిన బొజ్జ మహేందర్, శిరీష దంపతుల కూతురు బొజ్జ దీక్ష(4) తమ అమ్మమ్మ ఊరైన మైలారం గ్రామానికి తన తల్లితో కలిసి శనివారం ఉదయం వెళ్లింది. మధ్యాహ్నం అమ్మమ్మ ఇంటికి సమీపంలోని కిరాణా షాపునకు వెళ్లి తిరిగి వస్తుండగా సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన గడ్డం మహేందర్‌రెడ్డి బైక్‌పై వెళ్తూ బాలికను ఢీకొట్టాడు. దీంతో దీక్ష తలకు, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు, బాలుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు చిన్నారికి గాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామానికి చెందిన దంపతులు బానోతు ప్రకాష్, కవిత వారి రెండేళ్ల కొడుకు శివతో ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపునకు వెళ్తున్నాడు. కామారెడ్డి వైపు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలోకి వెళ్తున్న క్రమంలో ఢీ కొన్నాయి. ప్రమాదంలో బానోతు ప్రకాష్, కవిత వారి రెండేళ్ల కొడుకు శివకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

మెడికల్ కళాశాలకు వృద్ధురాలి పార్థివదేహం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)కు ఈశ్వరకృప వృద్ధాశ్రమం ప్రతినిధులు వృద్ధురాలి పార్థివదేహాన్ని దానం చేశారు. వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధుల ఆశ్రమంలో 11నెలలుగా కంటిచూపు లేకుండా బాధపడుతున్న ఎన్నాడి లక్ష్మి(78) అనే వృద్ధురాలు శనివారం మృతి చెందింది. ఆశ్రమ నిర్వాహకుడు పీటీ స్వామి సిమ్స్ కళాశాలలోని అనాటమి డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పనకు లక్ష్మి పార్థివదేహాన్ని అప్పగించారు. అనంతరం విద్యార్థులు, ప్రొఫెసర్లు మృతదేహానికి గౌరవ వందనం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సాన రామకృష్ణారెడ్డి, కేఎస్‌వాసు, చంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, రాంచందర్‌రావు, వెంకటయ్య ఉన్నారు.

విదేశాలకు పంపిస్తానని మోసం: వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు పంపిస్తానని మోసగించిన తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన ఎండీ మహెబూబ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామానికి చెందిన పెద్దపల్లి విజయ్‌కుమార్ అనే వ్యక్తిని విదేశాలకు పంపిస్తానని మోసగించి లక్ష రూపాయలు వసూలు చేసి తప్పుడు వీసాపై పంపించాడు. ఈ విషయంపై విజయ్‌కుమార్ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మోసగించిన మోహబూబ్‌ను శనివారం ఆరెస్ట్ చేసినట్లు తెలిపారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

జ్యోతినగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు దీపక్ కుమార్‌యాదవ్(20) అనే వలస కార్మికుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఇంటికి సమీపంలోని చెట్టుకు టవల్‌తో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీపక్‌కుమార్ ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కాలనీవాసులు అనుమానిస్తున్నారు. ఎన్టీపీసీ పోలీసులు ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టారు. మృతుడి సంబంధీకులు ఎవరూ స్థానికంగా లేకపోవడంతో ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఊరి కోసం మన నేతలు



గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా
కోనరావుపేట మండల నేతలు తమదైన ముద్ర వేశారు. రాజకీయంగా కీలక పదవులు చేపట్టి ప్రజాప్రతినిధులుగా రాణిస్తూ సేవా కార్యక్రమాల్లో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. - కోనరావుపేట

- రాజకీయాల్లో కీలక పదవులు
- సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ముద్ర

■ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారంలో పుట్టి పెరిగిన చెన్నమనేని రాజేశ్వరరావు గతంలో కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆయన కుమారుడు చెన్నమనేని రమేష్ బాబు జర్మనీకి చెందిన సేవ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్‌గా ఉంటూ ఆ సంస్థ ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు, వాటర్ ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేయించారు. అనంతరం వేములవాడ నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేశారు.

■ ఇదే కుటుంబంలో దివంగత ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు తమ్ముడు చెన్నమనేని విద్యాసాగర్‌రావు బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా, కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలు అందించారు. పుట్టి పెరిగిన నాగారం గ్రామంలో యువకుల ఉపాధి కోసం ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా యువకులకు ఉపాధి కల్పిస్తున్నారు. నాగారం గ్రామంలోని గుట్టపైన ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు భారీ ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా శ్రీరామచంద్రస్వామి ఆలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం తన కుమారుడు చెన్నమనేని వికాస్‌రావును ప్రజలకు పరిచయం చేస్తూ బీజేపీలో చేర్పించారు ప్రస్తుతం బీజేపీ వేములవాడ నియోజవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. బీజేపీలోకి రాకముందే ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. వేములవాడ నియోజకవర్గంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 108 అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

■ మల్కపేట గ్రామంలో పుట్టి పెరిగిన చల్మెడ ఆనందరావు సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిచి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న ఆయన పుట్టి పెరిగిన గ్రామానికి ఏదో చేయాలని తపనతో కుటుంబ సభ్యుల సహకారంతో ఆరు కోట్లతో శ్రీరామచంద్రస్వామి ఆలయం, మూడు కోట్లతో విద్యాలయాన్ని నిర్మించారు. ఆయన కుమారుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు, కరీంనగర్ చల్మెడ ఆసుపత్రి చైర్మన్ కొనసాగతుఉన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. లక్ష్మీనరసింహారావు వేములవాడ నియోజకవర్గంలో పేదల కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.





మల్కాపేటలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు తండ్రి ఆనందరావు సహకారంతో రూ. 2 కోట్లతో నిర్మించిన ఆధునిక పాఠశాల




నాగారంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం




చెన్నమనేని రమేశ్‌బాబు ఆధ్వర్యంలో మంగళపల్లిలో మొదటిసారిగా సేవ్ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన వాటర్ ట్యాంక్

రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శన పోటీల్లో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న నిత్యశ్రీ

జగిత్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శన పోటీల్లో జగిత్యాల పట్టణానికి చెందిన మహదేవుని నిత్యశ్రీ, వింజమూరి శ్రీకృతి అనే చిన్నారులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. హైద్రాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గల ఎన్‌టీఆర్ కళామందిరంలో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ స్థాయి నృత్య, పద్యనాటక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కూచిపూడి నృత్య పోటీల్లో జగిత్యాలకు చెందిన ఇరువురు చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. చిన్నారులు మహదేవుని నిత్యశ్రీ, వింజమూరి శ్రీకృతిలకు నిర్వాహకులు పరమేశ్వర్ బహుమతులు అందించారు. కాగా ప్రతిభ కనబరిచిన చిన్నారులను ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, జగిత్యాల మోదిని లలిత కళాక్షేత్రం నాట్యాచార్యులు బొమ్మిడి నరేశ్ తదితరులు అభినందించారు.

ప్రమాదకరంగా ఎండిన వృక్షం

- భయపడుతున్న వాహనదారులు


సుద్దాల ప్రధాన రహదారి కూడలి వద్ద ఎండిన వృక్షం

కోనరావుపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారి ప్రధాన కూడలిలో రోడ్డుపై ఎండిన వృక్షం ప్రమాదకరంగా మారింది. దీంతో వాహన దారులు, గ్రామస్థులు భయాందోళన చెందుతన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని ప్రధాన రహదారి ప్రధాన కూడలిలో హరితహారం కార్యక్రమంలో భాగంగా పెట్టిన చెట్టు వృక్షంగా మారి ఎండిపోయింది. దీంతో ఎండిన వృక్షం తొలగించకపోవడంతో రోడ్డుపై ఎప్పుడు పడిపోతోందని వాహనదారులు, గ్రామస్థులు భయపడుతున్నారు. వృక్షం పడిపోయి ప్రమాదం జరగకముందే తొలగించాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

మల్లాపూర్, డిసెంబరు, 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌తో పాటు సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో మల్లాపూర్ మండలంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని టీఎస్ 18టీ 5471 నంబరు గల వాహనంలో తరలిస్తుండగా వేంపల్లి గ్రామంలో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి వారి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమాజ విలువలు పెంపొందించేందుకే కవితలు

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ


సంపుటిని ఆవిష్కరిస్తున్న సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజ విలువలు పెంపొందించేందుకు కవితల సారాంశం ఎంతగానో ఉపయోగపడుతుందని సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెరంబదూర్ లింబగిరిస్వామి రచించిన 'నిశ్శబ్ద యుద్ధం' కవితా సంపుటిని శనివారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వల చేసి సభ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల బాధలు, వారికి జరిగే అన్యాయాలు, దోపిడీ అణిచివేతలను ఎదుర్కొని సమాజ విలువలు పెంపొందించే విధంగా నిశ్శబ్ద యుద్ధం కవితా సంపుటిలో అక్షరబద్ధం చేశారన్నారు. ప్రతీ హృదయంలో సాహిత్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

అనంతరం సుద్దాల అశోక్‌తేజను కవులు, అభిమానులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి, నాట్యాచార్యులు తిరుక్కోవెల లక్ష్మణస్వామి, గంద్ర ఆనం దరావు, దురిశెట్టి మనోహర్, సత్యనారాయణ, బాలె శివాజీ, శరత్‌చంద్ర, కేశవస్వామి, శ్రీనివాస్ స్వామి, ఉపాధ్యాయులు, కవులు, శ్రోతలు, అభిమానులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన అఖిల్, మధు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఈసరి అఖిల్ (చీర్లవంచ), సిరిపురం మధు (రుద్రంగి) శాతవాహన యూనివర్సిటీ నుంచి ఎంపికయ్యారు. ఈ నెల 18 నుంచి 22 వరకు ఐదు రోజులపాటు కేరళలోని తిరువనంతపురంలో జరిగే దక్షణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో శాతవాహన యూనివర్సిటీ నుంచి అఖిల్, మధు పాల్గొననున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన అఖిల్, రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మధు సిరిసిల్ల వీబీఏలో వాలీబాల్ శిక్షణ పొంది పలు టోర్నమెంట్లలో ప్రతిభ చాటాడు. గతంలో అఖిల్ జూనియర్స్, సీనియర్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టులో స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మధు ఎస్‌జీఎఫ్, జూనియర్స్ ఉమ్మడి కరీంనగర్ జట్టులో స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాడు.

వేములవాడ అగ్రహారం డిగ్రీ కళాశాలలో చదువుతూ శాతవాహన యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన అఖిల్ 2023-24లో మొదటిసారిగా దక్షణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇప్పుడు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ 2024-25లో రెండోసారి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అఖిల్, మధును వీబీఏ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు అభినందించారు.

దంపతులపై దాడి చేసి చోరీ

బీర్‌పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన కాసం ఈశ్వరయ్య అనే వ్యాపారి ఇంట్లో శనివారం తెల్లవారుజామున నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఈశ్వరయ్య దంపతులపై దాడి చేసి చోరీకి పాల్పడ్డారు. అతని భార్య ఒంటిపై ఉన్న మొత్తం 10 తులాల బంగారు నగలను, 10 తులాల వెండితో పాటు ఇంట్లో ఉన్న 10,000 వరకు నగదు ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుడు ఈశ్వరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి తెలిపారు. బాధితుడు ఈశ్వరయ్యను దొంగలు గాయపరచగా జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బేకరిపై మున్సిపల్ అధికారుల దాడులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ ఔట్ గేట్ ఎదురుగా ఉన్న బాబాసాయి బేకరిపై శనివారం రాత్రి మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. బేకరిలో బూజు పట్టిన కేకులు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. కుళ్లి పోయిన కోడిగుడ్లు, దుర్వాసనతో ఉన్న కేకులు, బేకరీలో వాడే ఇతర ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బేకరీ యజమానికి నోటీసులు ఇచ్చారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాలువ

- కూలిన డ్రాప్‌లు.. కాలువకు గండ్లు
- నిధులు మంజూరైనా మరమ్మతు కరువు

ఎలిగేడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు వరప్రదాయినిగా నిలిచిన శ్రీరాంసాగర్ ఆయకట్టు నీటిని అందించే డీ-86 ప్రధానకాలువ శిథిలావస్థకు చేరుకుంది. కాలువ మరమ్మ తులకు 49.80లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినా పనులను చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాలేదు. దీంతో చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీరు అందే పరిస్థితి కనబడడంలేదని రైతులు వాపోతున్నారు.

డీ-86 ప్రధాన కాలువద్వారా పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎలిగేడు, సుల్తానాబాద్, జూలపల్లి, ఓదెల, శ్రీరాంపూర్ మండలాల్లోని వేలాది ఎకరాల భూముల్లో పండే పంటలకు సాగునీరు అందిస్తోంది. ఈప్రాంత రైతులు ఎస్సారెస్పీ నీటిని ఆధారం చేసుకొని అధికశాతం వరిపంటను సాగు చేస్తున్నారు. సాగునీటిని అందించే ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరుకొని రెండు దశాబ్దాలు దాటినప్పటికీ మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

డీ-86 ప్రధాన కాలువపై ఉన్న డ్రాప్‌లు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి, ఉపకాలువలకు వెళ్లే తూములు కూలిపోతు న్నాయి. మరోవైపు కాలువకు ఇరువైపులా గండ్లు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే ఉపకాలువలు, పంట కాలువలు పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ కాలువల పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న యాసంగి పంటలకు వారబందీ పద్ధతిలో సరఫరా చేస్తే పంటలకు అరకొరగా అందే అవకాశం ఉండదని రైతులు వాపోతున్నారు. లాలపల్లి, ఎదురుగట నుంచి శివపల్లి వరకు డీ-86 ప్రధాన కాలువపై పెద్ద డ్రాప్పులు కూలిపోగా మరికొన్ని చోట్ల లోతైన మట్టి బుంగలు ఏర్పడ్డాయి. ఎప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వెంటనే కాలువలు, డ్రాపులు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

కాలువల మరమ్మతు చేపట్టాలి



కాసార్ల మహేందర్, రైతు, నారాయణపల్లి

ఎస్సారెస్పీ డీ-86ప్రధాన కాలువపై కూలిపోయిన డ్రాపులు, ఏర్పడిన బుంగల మరమ్మతులను వెంటనే చేపట్టాలి. లేకుంటే యాసంగిలో రైతులకు చివరి పంట భూములకు సాగునీరు అందక ఇబ్బందులు తలెత్తుతాయి.

మరమ్మతులకు నిధులు మంజూరు



- ప్రసాద్, ఎస్సారెస్పీ ఈఈ

లాలపల్లినుంచి శివపల్లి వరకు ఉన్న ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాలువ మరమ్మతులకు రూ.49.80లక్షలు నిధు లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాలేదు. త్వరగా పనులను చేపట్టేందుకు కృషి చేస్తాం.


శివపల్లిలో కూలిన ఎస్సారెస్పీ కాలువ డ్రాప్


తెగిన డీ-86 ప్రధాన కాలువ


కూలిన తూమ్

ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ

- రెబ్బల్‌దేవ్‌పల్లిలో 40 ఎకరాల్లో నర్సరీ
- ఎనిమిది లక్షల మొక్కల పెంపకం..
- అక్కడినుంచి జిల్లావ్యాప్తంగా పంపిణీ
- ఎస్సీలకు వంద, బీసీలకు తొంభై శాతం సబ్సిడీ
- నాలుగేళ్ల పాటు పెట్టుబడికి సాయం


రెబ్బల్‌దేవ్‌పల్లి నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఆయిల్‌పామ్ మొక్కలు

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రైతులకు సబ్సిడీ, పెట్టుబడి సాయం రూపంలో ప్రోత్సాహం అందిస్తున్నాయి. మూడేళ్ల క్రితం సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లిలో రాష్ట్ర ఉద్యానవన శాఖ వారి ఆధ్వర్యంలో తిరుమల కంపెనీకి చెందిన వారు ఆయిల్‌పామ్ నర్సరీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ఆయిల్‌పామ్ సాగుపై రైతులను చైతన్యపరిచే కార్యక్రమం చేపట్టారు. గ్రామగ్రామాన అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలను ఆహ్వానించి రైతుల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

48 ఎకరాల్లో నర్సరీ..

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ నర్సరీలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు రెబ్బల్‌దేవ్‌పల్లిలో నర్సరీని ఏర్పాటు చేశారు. గ్రామంలో 48 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలను విదేశాల నుంచి తెప్పించి వాటిని సంరక్షించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించి వారిని నర్సరీకి తీసుకువచ్చి తగిన శిక్షణ ఇప్పిస్తున్నారు. రైతుల భూములను గుర్తించి వాటికి నీటి వసతి ఉందా లేదా, ఆయిల్‌పామ్ సాగుకు యోగ్యమైన భూములు అవునా కాదా అని విచారిస్తారు. అవసరమైన చోట భూసార పరీక్షలు చేయించి సాగు కోసం సన్నద్ధం చేయిస్తారు.

మొక్కల సంరక్షణ..

రెబ్బల్‌దేవ్‌పల్లిలో 2021లో ఆయిల్‌పామ్ నర్సరీ ఏర్పాటు చేశారు. ప్రైమరీ నర్సరీలో మొదట మూడు నుంచి నాలుగు నెలల వరకు మొక్కలను పెంచుతారు. అనంతరం ఆ మొక్కలను అక్కడి నుంచి తొలగించి వాటిని ఇరవై కిలోల మట్టి కవర్లలో పెట్టి సెకండరీ నర్సరీకి తరలిస్తారు. అక్కడ 12 నుంచి 14 నెలలు సంరక్షించిన అనంతరం వాటిని రైతులకు పంపిణీకి యోగ్యంగా ఉన్నవా లేవా నిర్ధారిస్తారు. నర్సరీలో సంరక్షించిన ఆయిల్ పామ్ మొక్కలను జిల్లాలోని 14 మండలాలకు చెందిన రైతులకు పంపిణీ చేస్తున్నారు.


నీరుకుళ్లలో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్న రైతులు(ఫైల్)

పది వేల ఎకరాల్లో సాగు అంచనా..

జిల్లాలో పదివేల ఎకరాల్లో ఆయిల్ పామ్ రైతులతో సాగు చేయించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని అంతర్గాం మండలంలో 80 ఎకరాల్లో, ధర్మారం మండలంలో 314, ఎలిగేడులో 137, జూలపల్లిలో 2016, కమాన్‌పూర్‌లో 105, మంథనిలో 242, ముత్తారంలో 458, ఓదెలలో 162, పాలకుర్తిలో 153, పెద్దపల్లిలో 166, రామగిరిలో 119, రామగుండంలో 61, కాల్వశ్రీరాంపూర్‌లో 151, సుల్తానాబాద్‌లో 252 ఎకరాలతో కలిపి మొత్తం 4416 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీరందరికీ తామే మొక్కలు పంపిణీ చేశామని రెబ్బల్‌దేవ్‌పల్లిలోని నర్సరీ నిర్వాహకులు తెలిపారు.

రైతులకు సబ్సిడీ...

ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తిగల ఎస్సీ రైతులకు వంద, బీసీలకు తొంబై శాతం చొప్పున సబ్సిడీ ఇస్తారు. అలాగే డ్రిప్ కోసం అవసరమైన పెట్టుబడి మొత్తాన్ని అందించి నాలుగేళ్ల అనంతరం వాయిదాల రూపంలో కంపెనీ వారు వసూలు చేసుకుంటారు. ఆయిల్‌పామ్ సాగు చేసే ఒక్కొక్క రైతుకు ఎకరాకు రూ.4200 చొప్పున పెట్టుబడులు చెల్లిస్తారు. ఇలా నాలుగేళ్లకు దాదాపు పదిహేడు వేల రూపాయల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది.

ఎకరాకు రూ.1,140 చెల్లిస్తే చాలు..

- శివ, నర్సరీ మేనేజర్



ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఒక్కో మొక్కకు 20 రూపాయల చొప్పున ఎకరా సాగు కోసం 57 మొక్కలకు రూ.1140 చెల్లిస్తే సరిపోతుంది. ఆయిల్ పామ్ పంటలో రైతులు అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. నాలుగేళ్లలో మొక్కజొన్న, వేరుశనగ, పత్తితో పాటు కూరగాయలను అంతర పంటగా సాగు చేసుకోవాలి. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు 30 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది.

ఎయిర్‌ఫోర్స్‌కు సైనిక్ స్కూల్ విద్యార్థి ఎంపిక


సిద్దార్థ

చొప్పదండి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థి రామడుగు సిద్దార్థ ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికయ్యాడు. 12వ తరగతి పూర్తి చేసిన సిద్దార్థ్ ఎన్డీఏ పరీక్షలో ప్రతిభ చాటి ఎయిర్‌ఫోర్స్ వింగ్‌కు ఎంపికయ్యాడు. కాగా సిద్దార్థ్‌ను గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, సంయుక్త కార్యదర్శి సక్రు నాయక్, జోనల్ ఆఫీసర్ భీమయ్య అభినందించారు. ఈ మేరకు ఎన్డీఏకు ఎంపికకు కృషి చేసిన పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సి పాల్ కాళహస్తి, సిబ్బందిని సంస్థ కార్యదర్శి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి

గంగాధర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం కురిక్యాలకు చెందిన మాజీ ఎంపీటీసీ నందయ్య(50) శనివారం మధురానగర్ చౌరస్తాకు బైక్‌పై పని నిమిత్తం వెళుతున్నాడు. ఇదే సమయంలో కొడిమ్యాల మండలానికి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై కరీంనగర్ వైపు వస్తున్నాడు. మధురానగర్ చౌరస్తాలో రెండు వాహనాలు వేగంగా ఢీకొన్నాయి. కిందపడిన నందయ్యకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు 108లో కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

త్రీడీ ఆర్టిస్ట్‌ను అభినందించిన గవర్నర్

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్ ఎస్ఎస్ఆర్ కృష్ణను శనివారం గవర్నర్ జిష్ణుదేవ్ అభినందించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి త్రీడీ ఆర్ట్ గురించి వివరించారు. వివిధ దేశాల్లో కృష్ణ గీసిన త్రీడీ చిత్రాలను ఆసక్తిగా గవర్నర్ పరిశీలించి కృష్ణను అభినందించారు. మహాభారత కాలంనాటి ఈ త్రీడీ ఆర్ట్‌ను అభివృద్ధి చేయాలని, రాజ్‌భవన్ స్కూల్‌లో త్రీడీ ఆర్ట్ అవగాహన వర్క్‌షాప్ నిర్వహించాలని గవర్నర్ సూచించారు.

నిఫ్ట్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- మొదలైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు - జనవరి 6 వరకు అవకాశం



మాట్లాడుతున్న ప్రొఫెసర్లు అనంతఫణి, రామకృష్ణ, నరేష్‌కుమార్

సుభాష్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని, అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్లు అనంతఫణి, రామకృష్ణ, నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియచేశారు. ఈ కోర్సులో అండర్ గ్రాడ్యుయేట్స్ కోర్సులలో ఫ్యాషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, యాక్సెరీ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, లెదర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీ ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హతతో ఇందులో చేరవచ్చన్నారు. డిగ్రీ, పీజీ చేసినవారు కూడా ఈ కోర్సులో చేరవచ్చన్నారు. ఎక్కువగా ఉత్తర భారతదేశానికి చెందిన వారే ఇందులో చేరుతుంటారని, దక్షిణ భారత్‌లో దీనిపై ఎవరూ దృష్టి పెట్టరని అన్నారు. 2025 విద్యా సంవత్సరానికి నవంబరు 20 నుంచే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని, 6 జనవరి 2025తో గడువు ముగుస్తుందని తెలిపారు. రూ. 5వేల ఫైన్‌తో జనవరి 7 నుంచి 9 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. 9 ఫిబ్రవరి 2025లో ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఉంటుందన్నారు. ఏప్రిల్ చివరిలో ఫలితాలు ప్రకటిస్తారని, జూన్ 2025లో సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

గోదావరిఖని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించే బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో కనీస వేతనాల మండలిని నియమించారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టించుకోలేదన్నారు. మళ్లీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేతన మండలి చైర్మన్‌ను నియమించింది కానీ సభ్యులను నియమించకుండా కాలయాపన, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కనీస వేతన సవరణ చట్టానికి అనుగుణంగా జీవోలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలకు మాత్రమే స్థానం కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నరేష్, అశోక్, చిలుక శంకర్, దుర్గయ్య, రవికుమార్, సాంబయ్య, ప్రవీణ్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐ కృష్ణ

ఎంసీహెచ్‌లో శిశువు మృతి

- అట్ట డబ్బాలో పెట్టి తండ్రికి అప్పగించిన సిబ్బంది -ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు, (ఇన్‌సెట్‌లో శిశువును అట్ట డబ్బాలో పెట్టి ఇచ్చిన సిబ్బంది)

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మాతా శిశు కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. పుట్టినప్పుడు ఆరోగ్యంగా ఉన్న శిశువు రెండు రోజుల తర్వాత అకస్మాత్తుగా మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతో తన కుమారుడు మృతి చెందాడని శిశువు తండ్రి ఆరోపిస్తున్నాడు. ఆలస్యంగా ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నగునూర్ లచ్చక్కపేటకు చెందిన కిషోర్-శ్రీలతలకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మూడో సంతానంగా జగిత్యాలలోని మాతా శిశు కేంద్రంలో ఈనెల 10వ తేదీ మంగళవారం కుమారుడు జన్మించాడు. శిశువు పుట్టిన తర్వాత పరీక్షించిన వైద్యులు ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భార్య వద్ద తన బంధువును ఉంచిన కిషోర్ పనికోసం బయటకు వెళ్లాడు. గురువారం సాయంత్రం ఆస్పత్రి నుంచి బాబు సీరియస్‌గా ఉన్నాడంటూ కిషోర్‌కు ఫోన్ రావడంతో హడావిడిగా మాతా శిశు కేంద్రానికి చేరుకున్నాడు. ఆయనకు బాబు మృతి చెందాడని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న బాబు ఎలా మృతి చెందాడని ప్రశ్నిస్తే వైద్యులు ఒక్కొక్కరు ఒక్కోరకమైన సమాధానం చెప్పారని కిశోర్ ఆరోపిస్తున్నాడు. బాబుకు ఆస్పత్రి సిబ్బంది వ్యాక్సిన్ ఇచ్చారని, వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాతనే మృతి చెందాడని అతను ఆరోపిస్తున్నారు. మృత శిశువును తన చేతికి అప్పగించారని, తర్వాత కాటన్ డబ్బాలో శిశువును పెట్టి హడావిడిగా అక్కడి నుంచి పంపించారని ఆరోపించాడు. శిశువు మృతి చెందిన విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములను వివరణ కోరగా బాబు ఆరోగ్యంగా జన్మించాడని, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, పాలు సరిగా పట్టకపోవడం వల్ల పాలు ముక్కులోకి వెళ్లి శ్వాస అందక మృతి చెందాడని ఆయన వివరణ ఇచ్చారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ


రాజన్న ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న నిర్వాహకులు, అర్చకులు

కోరుట్ల రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామంలోని సంగమేశ్వర ఆలయంలో శనివారం అయ్యప్ప పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితుడు పాలెపు రామకృష్ణ శర్మ మంత్రోచ్ఛారణల మధ్య పడి పూజ మహోత్సవం నిర్వహించారు. గురుస్వామి సుద వేణి భూమయ్య ఆధ్వర్యంలో 18వ సారి దీక్ష భూనిన శంకర్ పడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

- వైభవంగా ఆరట్టు ఉత్సవం

వేములవాడ కల్చరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అయ్యప్ప ఆలయంలో శనివారం ఆరట్టు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రాజరాజేశ్వ రస్వామి ఆలయంలోని ధర్మగుండంలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 6.30 గంటలకు ఆలయంలో పడిపూజ నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొండ దేవయ్యపాల్గొన్నారు.


కోరుట్లలో కర్పూర హారతులు అందిస్తున్న స్వాములు

- ఆరట్టు ఉత్సవంలో ప్రభుత్వ విప్

వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన ఆరట్టు ఉత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తదితరులు ఉన్నారు.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయానికి చేరుకుని ఆలయ వసతిగృహాల్లో విడిది చేశారు. తెల్లవారు జామున కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో అశోక్, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లు చేశారు.

రాజన్నను దర్శించుకున్న మితాలి మధుస్మిత

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కామ్‌టాక్స్ ఐఆర్ఎస్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుస్మిత శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి


అలంకరణలో స్వామివారు

ధర్మపురి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 8 నుంచి ఆరంభమైన దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా పౌర్ణమి రోజున ఉదయం స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయం పక్కనే గల ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల ఆలయంలో దత్తాత్రేయ స్వామి వారలను అందంగా పూలతో అలకంరించారు. అనంతరం ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్‌శర్మ, ద్యారం గురుప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారలకు రుద్రాభిషేకం, పురుషసూక్తం, విశేష పూజలు జరిపారు. పౌర్ణమి సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోదావరి నదీ తీరాన గల ఆలయంలో రాత్రి వేళలో మంత్ర జాగరణ, ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. అలాగే దివ్యదర్శనం, బాల దత్తాత్రి డోలోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, రొట్టె శ్రీనివాస్ పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం పూజలు నిర్వహించారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శనివారం వేలాది భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, ఇతర పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు

● రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో గల ఉప ఆలయం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం నుంచి నెల రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణరావు తెలిపారు. ఈ సందర్భంగా నిత్యం ఆండాల్ అమ్మవారికి పంచామృత అభిషేకం, తిరుప్పావై అనుసంధానం, పొంగలి నివేదన, భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఇందులో భాగంగా జనవరి 10న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వారా దర్శనం, 13న గోదా రంగనాథ కళ్యాణ ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు

ఉమ్మడి జిల్లా షూటింగ్ బాల్ పోటీలకు స్పందన


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా యునైటెడ్ షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని సప్తగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి 160 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభచాటారు. ఈ పోటీల్లో విశేష ప్రతిభచాటిన క్రీడాకారులను ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఆరిఫ్ పాష, మహ్మద్ ముఫాజిల్ అహ్మద్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఆశాలు కుమార్, నాగరాజు, సీనియర్ క్రీడాకారులు ఆదిత్య, నరేశ్, వంశీ, అద్నాన్, సబిక్ పాల్గొన్నారు.

స్నేహితుడని నమ్మితే నట్టేట ముంచాడు

- 15 మంది క్రెడిట్ కార్డులు స్వైప్ చేసి ఉడాయించిన యువకుడు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడని నమ్మిన వ్యక్తి కుటుంబ సభ్యులు అనారోగ్యంతో ఉన్నారని చెప్పి ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద క్రెడిట్ కార్డులు తీసుకుని 40 లక్షలతో ఉడాయించాడు. ఈ సంఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో జరగగా బాధితులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జామ్‌బాగ్‌కు చెందిన కల్లెం యశ్వంత్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన తల్లి, భార్య అనారోగ్యం పేరు చెప్పి ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద 15 మంది క్రెడిట్ కార్డులు తీసుకుని 40 లక్షల రూపాయలు స్వైప్ చేశాడు. ఆ డబ్బులు తీసుకుని ఉడాయించాడు. క్రెడిట్ కార్డులు లేని వారికి క్రెడిట్ కార్డులు ఇప్పించి మరీ మోసగించాడని బాధితులు వాపోయారు. దీంతో బాధితులు శనివారం అతని ఇంటి ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. అనంతరం బాధితులు జగిత్యాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు నెలల నుంచి పరారీలో ఉన్న యశ్వంత్‌ను పట్టుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

బీఎంఎస్ కార్యవర్గం ఎన్నిక

భగత్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): భారత్ మజ్దూర్ సంఘ్ కరీంనగర్ నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యాలయంలో శనివారం ఎన్నుకున్నారు. బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా పసుల శ్రవణ్, కార్యదర్శిగా తొర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నోముల ప్రసాద్, గోవిందుల సతీష్, నక్క అరుణ్‌కుమార్, ఎం రమణయ్య, సహాయ కార్యదర్శులుగా రామాంజనేయులు, దేవరనేని మహేందర్‌రావు, తాటికొండ తిరుపతి, కర్ణకంటి సత్యం, కోశాధికారి పోతరవేణకుమార్ యాదవ్, కార్యాలయ కార్యదర్శిగా మాడిశెట్టి సునీల్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): లోయర్ మానేరు డ్యాం ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలని ముంపు గ్రామాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉప్పులేటి లక్ష్మన్ కోరారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ గ్రామం హస్నాపూర్ ఎల్ఎండీ నిర్మాణంలో ముంపు గురైందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముంపు బాధితులకు ఇంటితోపాటు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కనకలక్ష్మి, మధు, సుజాత, లక్ష్మీ, క్రాంతి ఉన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

గణేశ్‌నగర్,డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ మంత్రి లేకుండానే విజయోత్సవాలు చేసుకోవడం శోచనీయమని విద్యా శాఖ మంత్రి లేని కేబినెట్ దేశ చరిత్రలోనే లేదని ప్రభుత్వం వేంటనే విద్యాశాఖ మంత్రిని భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ అన్నారు. మంకమ్మతోటలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు.

సెక్యూరిటీస్ మార్కెట్‌పై సదస్సు

భగత్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్ఎం ఎంసిఏ కళాశాలలో శనివారం ఎన్ఎస్‌డీఎల్, సెబి ఆధ్వర్యంలో సెక్యూరిటీస్ మార్కెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తిరుపతిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలు

భగత్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మున్సిపాలిటీ 10వ వార్డులో ఎస్‌డిఎఫ్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజులు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీమాత దత్తపౌర్ణమి హవనం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శనివారం సరస్వతీమాత దత్తపౌర్ణమి హవనం ఘనంగా నిర్వహించారు. సముద్రాల రాజమౌళి-ప్రణీతరాణి, కలకుంట్ల వేంకటేశ్వర్‌రావు-నీరజాదేవి దంపతులు, బాల కుటీర్ నిర్వాహకురాలు అప్పిడి వకుళాదేవి, వాసుదేవ హాస్పిటల్ యజమాని డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కోల అన్నారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ● నూతన మెనూ ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు



మాట్లాడుతున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



గంగాధరలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. మండలంలోని వెదిర బీసీ, ఎస్సీ హాస్టల్‌లో శనివారం కామన్ డైట్ మెనూ ప్రారంభించారు. పాఠశాల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో శ్రావన్‌కుమార్, నాయకులు వెన్న రాజ మల్లయ్య, శేఖర్‌గౌడ్, శంకరయ్య, కాడే శంకర్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

● గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద నిర్వహిస్తున్న జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న నూతన డైట్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. మండల ప్రత్యేకాధికారి రామానుజం, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, డీసిసి ప్రధానకార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి పాల్గొన్నారు.

●గంగాధర: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల, జ్యోతిబాపూలే బాలురు, బాలికల గురుకుల పాఠశాలలో శనివారం కామన్‌డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు వెలిచాల తిరుమల్‌రావు, మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, నియోజకవర్గ అధ్యక్షుడు యగ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: రాష్ట్రంలోని విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో కామన్ డైట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

● తిమ్మాపూర్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం(బాలికలు)లో ఖమ్మం జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రంసింగ్ ముఖ్య అతిథిగా హాజరై కొత్త కామన్ డైట్ మెనూ ప్రారంభించారు. అలుగునూర్‌లో గల సాంఘిక సంక్షేమ ప్రతిభ కళాశాల(సీవోఈ)లో ఎంపీవో సురేందర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కామన్ డైట్ మెనూ ప్రారంభించారు.

● వీణవంక: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో శనివారం నూతన మెనూ ఎంపీడీవో శ్రీధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యశోద తదితరులు పాల్గొన్నారు.

● చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల అభ్యున్నతికి కృషి చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ అన్నారు. చొప్పదండిలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలికల కళాశాలలో మెనూ చార్టును ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ అర్బన్/గణేశ్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల నలభైశాతం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల కళాశాల నూతన మెనూను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచక గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మంచి పౌష్టికాహారంతో పాటు కాస్మోటిక్ చార్జీలు పెంచిందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్, స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: గురుకుల కళాశాలల్లో , పాఠశాలల్లో పౌష్టికాహారం అందించడానికి ప్రమాణాలను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్ మండలంలోని నగునూర్ తెలంగాణ సంక్షేమ గురుకుల కళాశాలలో నూతన మెనూను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాలతి, వైస్ ప్రిన్సిపల్ సుమలత, ప్రత్యేక అధికారి ఎంపీడీవో సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● బొమ్మకల్ బైపాస్‌లోని మైనార్టీ గురుకుల బాలుర1, ఇరుకుల్లలోని మైనార్టీ గురుకుల 2 మొగ్దుంపూర్‌లోని బాలురు 3 పాఠశాలలు, బొమ్మకల్ బైపాస్‌లోని గిరిజన గురుకుల కళాశాల, మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల, దుర్శేడ్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్, నగునూర్‌లోని బీసీ హాస్టల్‌లో ప్రత్యేక అధికారులు కొత్త మెనూ ప్రారంభించారు. డీఆర్‌డీవో అదనపు డైరెక్టర్ సునీత, ప్రిన్సిపల్ బీర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● భగత్‌నగర్: రేకుర్తిలోని మైనార్టీ రెసిడెన్షియల్ వసతి గృహంలో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూను ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, లేయిక్ ఖాద్రి, నేహాల్ అహ్మద్, మహమ్మద్ కలిముద్దీన్, బాలబాద్రి శంకర్, ఎండి అజీం తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞవరాహ క్షేత్రంలో
రేపటి నుంచి 'సాతులూరి' ప్రవచనం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో సర్వవైదిక సంస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఎన్నో బిరుదులను పొంది, దేశ విదేశాల్లో ప్రవచనాలు, భాగవత, రామాయణాది క్రతువులు నిర్వహించిన ప్రముఖ పండితుడు సాతులూరి గోపాల కృష్ణమాచార్య స్వామి 30 రోజుల పాటు క్షేత్రంలో ప్రవచనం చేయనున్నారు. ఉదయం 9-30 గంటల నుంచి శ్రీవచన భూషణం, సాయంత్రం 6 గంటల నుంచి తిరుప్పావై ప్రవచనాలు జరుగనున్నాయి. భక్తులు ప్రవచనాల్లో పాల్గొని తరించి శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాదశర్మ కోరారు.



సాతులూరి గోపాల కృష్ణమాచార్య స్వామి

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలోని ముకరంపురలో గల పద్మనాయక కల్యాణ మండపంలో శనివారం పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో వెలమ సామాజికవర్గానికి చెందిన 65 మంది నిరుపేద విద్యార్థులకు 3 లక్షల 15 వేల రూపాయల విలవగల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పద్మనాయక వెలమ సంఘం కరీంనగర్ అధ్యక్షులు జువ్వాడి వేణుగోపాల్‌రావు,ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,డిసెంబర్ 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా ఆదివారం ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్, వన్, టూ, రూరల్, ఏడిఈలు, పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఏం లావణ్య, రూరల్ ఏడిఈ గాదం రఘు తెలిపారు. టవర్ సర్కిల్, గంజ్, బోయివాడ, మార్కెట్ ఏరియా, సిఖ్‌వాడి, లక్ష్మీనగర్, రాఘవేంద్రనగర్, కమాన్ ఏరియాలో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల రరకు బస్టాండ్ ఏరియా, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్,ఉదయం 9నుంచి 11 గంటల వరకు బద్దిపల్లి, బావుపేట్, ఖాజీపూర్, సాయినగర్, నాగుల మల్యాలలో నిలిపివేయనున్నారు.

ఈ నెల 25న ఒలంపియాడ్ టెస్ట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రినిటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి

సుభాష్‌నగర్, డిసెంబరు 14: ప్రముఖ శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి ట్రినిటీ జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో ఈ నెల 22న ఒలంపియాడ్ టెస్ట్-2024 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. పదవ తరగతి విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహించే ఈ టాలెంట్ టెస్ట్‌ను ఈనెల 10 నుంచి 18 వరకు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వారి పాఠశాలల్లోనే లెవెల్-1 పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు లెవెల్-2 పరీక్షను కరీంనగర్‌లోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్, ఏసీ బాయ్స్ క్యాంపస్, గర్ల్స్ ఏసీ క్యాంపస్‌లలో నిర్వహిస్తారని తెలిపారు. లెవెల్-2 పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈ నెల 25న ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్‌లో బహుమతి ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. లెవెల్-2లో 80శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్ 10 నుంచి 100 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు.

పారమితలో ఘనంగా వార్షికోత్సవం



పారమిత స్కూల్ వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పారమిత హెరిటేజ్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాదరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్కృతుల సమ్మేళనం అనే అంశం ఆధారంగా జరిగిన 'ఆలయ' అనే ఈ వార్షికోత్సవంలో విద్యార్థుల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. విద్యా సంవత్సరంలో స్కాలర్‌షిప్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరించిన విద్యార్థులకు నగదు బహుమతులను ప్రసాదరావు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోద్‌రావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వియుఎం ప్రసాద్, టిఎస్‌వి రమణ, హన్మంతరావు పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డిని సత్కరించిన కలెక్టర్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కరీంనగర్ జిల్లాకు చెందిన గసిరెడ్డి జనార్దన్ రెడ్డిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం సత్కరించారు. గత 30 సంవత్సరాలుగా ఉమ్మడి జిల్లా క్రీడారంగంలో అనేక మైలురాళ్లనుదాటి క్రీడారంగ అభివృద్ధికి కృషి చేసిన ఆయన రాష్ట్ర ఒలంపిక్ సంఘంలో చోటు దక్కించుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌వో వెంకటేశ్వర్, ఒలంపిక్ సంఘ ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దండోరా ప్రదర్శనను విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం తలపెట్టిన దండోరా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దండోరా ప్రదర్శన సన్నాహక సమావేశాన్ని కరీంనగర్‌లో ఈ నెల 17న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకట స్వామి, ఎంఎస్‌ఎఫ్ సండే కార్తీక్, రుద్రరాపు రామచందర్, బోయిని కొమురయ్య, గుండె థామస్, చిలుముల రాజయ్య, దండు అంజయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కరీంనగర్‌టౌన్,డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి.హెచ్. పల్లవి, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ అన్నారు. శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీబావం తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు కరీంనగర్ టీపీటీఎఫ్ మద్దతు తెలుపుతున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు జంకె రామచంద్రారెడ్డి, వేల్పుల బాలయ్య, రాష్ట్ర కౌన్సిలర్ అర్కాల శ్రీనివాస్, కోట రామస్వామి అన్నారు. శనివారం సమ్మె శిబిరాన్ని సందర్శించారు.

కొనసాగుతున్న మాజీ సర్పంచుల దీక్ష

సుభాష్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. శనివారం వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు దీక్ష చేపట్టారు. మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం, వేముల దామోదర్, నవీన్‌రావు, కంకణాల విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

భగత్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ బొమ్మకల్ జోన్ చైర్ పర్సన్ చింతల కిషన్ పటేల్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రిలో పలువురికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 145 ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు.

'ఏడాది గడిచినా అమలు కాని హామీలు'

భగత్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం గడిచినా హామీలు అమలు కాలవడం లేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలపై సీఎం, ఉపముఖ్యమంత్రి మాట తప్పుతున్నారన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

కరీంనగర్ రూరల్, డిసెంబర్14(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ పరిధిలోని రజ్వీ చమన్, సిటిజన్ కాలనీల్లో జీపీ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ మహ్మద్ పాషా, మాజీ వార్డు సభ్యులు వాజీద్ అలీఖాన్, డీసీసీ ఉపాధ్యక్షుడు హజీ భాయ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించడమే లక్ష్యం

శంకరపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలోని విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం మెనూ మార్చిందని టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను శనివారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆయన సందర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే


సైదాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతంగా కొనసాగుతోందని పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు మునిగంటి స్వామి అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం కార్యదర్శులు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేశారని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

హుజూరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగాలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణు శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులా

- రెండో విడత దళితబంధు డబ్బులు విడుదల చేయాలి - ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తమపై కేసులు పెడతారానని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల కు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తే తాము ప్రశ్నిస్తే తమపై కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రశ్నించే హక్కును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అణగదొక్కుతున్నారన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కేటీఆర్‌ను అరెస్టు చేస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండమవుతుందన్నారు. నియోజకవర్గంలో దళి తబందు లబ్ధిదారులకు రెండో విడత అందజేయాలన్నారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సినీ హీరో అల్లు అర్జున్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కావాలనే అరెస్టు చేయించారన్నారు. అనంతరం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రూ. 50లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో ఎమ్మెల్యే పాడి కౌశికొరెడ్డి కల్యాణలక్ష్మి, షాదీము బారక్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రూ. 19 లక్షలు విలువ చేసే చెక్కులను పలువురికి అందజేశారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

వీణవంక, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మండలంలోని చల్లూరు గ్రామంలో ఆల్ఫోర్ నెబుల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన ట్రినిటి ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్ర మంలో ఏసీపీ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శోభారాణి, ప్రిన్సిపాల్ జాన్‌థా మస్, మనోజ్‌కుమార్, సీఐ కిషోర్, ఎస్ఐ తిరుపతి ట్రైని ఎస్ఐ భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మానకొండూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో టీడీపీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్‌తో పాటు బంజేరునపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 50 శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులందరు ఐక్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, కోండ్ర సురేష్, దూలం దేవేంద్ర, వీరస్వామి, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శివలీల మృతి పార్టీకి తీరని లోటు

చిగురుమామిడి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సభ్యురాలు బుర్ర శివలీల మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటిరెడ్డి ఆన్నారు. మండలంలోని ఇందుర్తి గ్రామా ఎంపీటీసీ సభ్యురాలు బుర్ర శివలీల శనివారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివలీల అంత్యక్రియలకు సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల సీపీఐ జిల్లా కార్యదర్శులు మంద పవన్‌కుమార్, మర్రి వెంకటస్వామి తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు హాజరయ్యారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



హుజూరాబాద్‌లో చెక్కు అందజేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుమారు రూ. 32.54లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ శనివారం 72మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని తెలిపారు.

● వీణవంక: మండలంలోని ఎలుబాక గ్రామానికి చెందిన తెడ్ల అశోక్, లస్మక్కపల్లి గ్రామానికి చెందిన బొంకురి రాజయ్య, ఘన్ముక్ల గ్రామానికి చెందిన గుడిపాటి జన్నమ్మ, కొలిపాక లచ్చమ్మకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కట్కూరి ఉపేందర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్, కంకణాల జగదీశ్వర్‌రెడ్డి, గోట్టె రాజయ్య, మార్కెట్ డైరెక్టర్ నల్లగొని సతీష్, సాహెబ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

● ఇల్లందకుంట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ సీఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, రామారావు, రజిత, మహేష్, మహి పాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల నియామకం

గంగాధర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గ్రామ బూత్ కమిటీలను శనివారం ఎన్నికల ఇన్‌చార్జి వాసుదేవరెడ్డి నియమించారు. మండలంలోని ర్యాలపల్లి గ్రామ బూత్ కమిటీ అధ్యక్షులుగా బొడిగే అభిషేక్, గరిగంటి రాజు, చర్లపల్లి(ఆర్) బూత్ కమిటీ అధ్యక్షుడిగా అమిరిశెట్టి అజయ్‌ను నియమిస్తూ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి వాసుదేవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో బీజేపీ బూత్ అధ్యక్షుల ఎన్నిక బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికలాధికారి ఆకుల రాజేందర్ సమక్షంలో కేశవపట్నం 111వ బూత్ అధ్యక్షుడిగా తోట అనిల్, ప్రధాన కార్యదర్శిగా తోట అరవింద్, బీఎల్ఏ2గా తాడవేణి కార్తీక్, అర్కండ్ల బూత్ అధ్యక్షుడిగా నెదురు అరుణ్, ప్రధాన కార్యదర్శిగా చెర్ల సురేష్, బీఎల్ఏ2గా చెర్ల మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సమ్మిరెడ్డి, కొంరయ్య, సారయ్య, వెంకటలక్ష్మి, శ్రీనివాస్, సాయిప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రామడుగు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): షానగర్‌లో ఈ నెల 26న నిర్వహించే అంబేద్కర్ విగ్రహావిష్కరణ, అంబేద్కర్ విజ్ఞాన మందిరం ప్రారంభోత్సవ పోస్టరును శనివారం మాజీ ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజవయంతం చేయాలని కవితలక్ష్మణ్ కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడికి సన్మానం

వీణవంక, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వీణవంక మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన శీలం సురేందర్‌రెడ్డిని శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సన్మానించారు. పార్టీ పటిష్టతకు పాటుపడాలని కోరారు.

సీఎం రిలీఫ్ చెక్కు అందజేత

కరీంనగర్‌రూరల్,డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దాడి నర్సయ్యకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్ సహకారంతో సీఎం సహాయ నిధి చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు.